# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

బుధవారం | 10 | జూన్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com




### పదర మండలంలో

# చిరుత పులి గోర్ల కలకలం

**రాయలగండి తండాలో ఏడు చిరుత గోర్లు స్వాధీనం**

ముగ్గురిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు.. మరిన్ని అరెస్టులకు అవకాశం



4

నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం రాయలగండి తండాలో చిరుత పులి గోర్లు లభించడం కలకలం రేపింది. కొందరు వ్యక్తుల వద్ద వన్యప్రాణులకు చెందిన అవశేషాలు ఉన్నట్లు అటవీశాఖ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందడంతో గత కొన్ని రోజులుగా ప్రత్యేక నిఘా కొనసాగించిన అధికారులు సోమవారం రాత్రి తండాలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కొందరు వ్యక్తుల వద్ద నుంచి దాదాపు ఏడు చిరుత పులి గోర్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

*– పదర, జూన్ 9 (మనం న్యూస్)*

### మూడు నెలల్లోనే ప్రాజెక్టుల

# భూసేకరణ పూర్తి చేయాలి

**అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు**

రైతులతో చర్చించి అవార్డులు పూర్తి చేయాలని సూచన




2



### కడుపునిండా అన్నం పెట్టే చేతులకు

# పుట్టెడు కడుపు కోత

**స్వరాష్ట్రం సాధించుకున్నామనే సంబరం తప్ప, డైలీ వేజ్ వర్కర్ల బ్రతుకులు హీనమాయే**

**పని భారం ఎక్కువ పైస తక్కువ**

కష్టపడేవారు మంటల్లో.. లక్షల జీతాలు తింటున్న వారు ఏసీల్లో

చాలీచాలని జీవితాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం

రెక్క ఆడితే గాని డొక్కాడని డైలీ వర్కర్ల బతుకులు మారేదెప్పుడు?

ప్రభుత్వాలు మారిన.. మా బ్రతుకులు మారవా?

మా డైలీ వేజ్ వర్కర్ల గోస వినరా పెద్ద సారోళ్ళు

స్వరాష్ట్రము సాధించుకున్నామన్న సంబరం తప్ప, మా ఆకలి కేకలు, బాధలు తీరేది ఎప్పుడు అయ్యా అంటూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో డైలీ వేజ్ వర్కర్ల అర్ధనాదాలు అంతా ఇంతా కాదు. గత నాలుగు నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సరియైన పనికి సరైన గౌరవ వేతనం ఇవ్వాలంటూ పలు డిమాండ్లతో దాదాపు నెల పైబడి ఆశ్రమ పాఠశాలల ముందు నిరసన, ధర్నా కార్యక్రమాలు వినుత్న రీతిలో డైలీ వేజ్ వర్కర్లు కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అయినా కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మా బ్రతుకులు మారవా అంటూ డైలీ వేజ్ వర్కర్లు ముక్తకంఠంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2



# కడుపునిండా అన్నం పెట్టే చేతులకు పుట్టెడు కడుపు కోత



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 9 (మనం బ్యూరో) : ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖలో అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న డైలీ వేజ్ కార్మికుల పరిస్థితి నేటికీ ఆందోళనకరంగా ఒక ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందా అన్న భయంతో వారు ఉడిపోతున్నారు. ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారుతున్నారు, అనేక సంక్షేమ పథకాలు పెరుగుతున్నాయి, కానీ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల జీవితాల్లో మాత్రం ఏమాత్రం మార్పు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కళాశాల వసతి గృహాలు, కార్యాలయాల్లో డైలీ వేజ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు విద్యార్థుల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు కష్టపడుతూ విద్యార్థులకు మూడు పూటలా కడుపు నింపుతున్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు భోజనం, వసతి, పరిశుభ్రత, భద్రత, కార్యాలయ నిర్వహణ వంటి అనేక బాధ్యతలను నిర్వర్తిస్తు ముందుకు వెళ్తున్న ఆ డైలీ వర్కర్లు ఏం పాపం చేశారయ్యా...? వారి బతుకులు మారేది ఎప్పుడు అంటూ పలుకుల సంఘాలు, ప్రతిపక్షాల నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, వేతనం మాత్రం లభించడం లేదని వాపోతున్నారు.

**...పని ఒకటి వేతనం, మరొకటి...**

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు లేవనెత్తుతున్న ప్రధాన ప్రశ్న “పని ఒకటే అయితే వేతనం ఎందుకు వేరుగా ఉంటుంది?” అనేదే. ఒకే కార్యాలయంలో, ఒకే విధమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ ఉద్యోగికి నెలకు ఒక లక్ష రూపాయల వరకు జీతం వస్తుండగా, డైలీ వేజ్ వర్కర్ మాత్రం కేవలం రూ. 11,700 వేతనంతోనే కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదెక్కడి న్యాయం అంటూ కొంతమంది ప్రశ్నిస్తున్నారు.

**కష్టానికి తగ్గ ఫలితం దక్కాలి**

సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం రాజ్యాంగం, న్యాయస్థానాల తీర్పుల్లో ప్రస్తావనకు వచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల్లో 80 నుంచి 90 శాతం వరకు వ్యత్యాసం ఉండటం అన్యాయమని వారు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు.

**కార్యక్రమాలన్నింటిలోనూ ముందుండేది గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లే**

ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రత్యేక డ్రైవ్‌లు, విద్యార్థుల ప్రవేశాలు, పరీక్షల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు, పరిశుభ్రత కార్యక్రమాలు, పండుగలు, జాతీయ దినోత్సవాలు ఇలా ఏ కార్యక్రమం జరిగినా క్షేత్రస్థాయిలో ఎక్కువగా పని చేసేది గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లేనని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. అయితే పనిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వేతనాలు, సేవా భద్రత, ఉద్యోగ గుర్తింపు విషయంలో మాత్రం వారిని పక్కన పెడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఒక్కో జిల్లాలో ఒక్కో వేతనం**

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమస్యల్లో మరో ప్రధాన అంశం వేతనాల్లో ఏకరీతి లేకపోవడం. ఒక జిల్లాలో ఒక విధంగా, మరో జిల్లాలో మరో విధంగా వేతనాలు చెల్లిస్తున్న పరిస్థితి ఉందని కార్మికులు చెబుతున్నారు. ఒకే శాఖలో, ఒకే విధమైన పని చేస్తున్నప్పటికీ జిల్లాల వారీగా వేతనాల్లో తేడాలు ఉండటం కార్మికుల్లో అసంతృప్తిని పెంచుతోందన్నారు. అయినప్పటికీ డైలీ వేజ్ వర్కర్ల బ్రతుకులతో ప్రభుత్వాలు, పాలకులు ఆడుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన వేతన విధానం అమలు చేయాలని వర్కర్ల డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ లెక్కల్లో ఉన్నట్టా... లేనట్టా....?**

వేలాది మంది గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారిక గణాంకాల్లో వారి స్థితి స్పష్టంగా లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో వారి సంఖ్యపై కూడా స్పష్టత లేకపోవడం, సంక్షేమ పథకాల అమలులో వారికి ప్రాధాన్యత లేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు, ఆరోగ్య భద్రత, బీమా వంటి సౌకర్యాలు కూడా చాలా మందికి అందడం లేదని తెలుస్తోంది.

**25 ఏళ్లుగా బ్రతుకు పోరాటం**

కొంతమంది గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు 20 నుంచి 25 సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ తాత్కాలిక ఉద్యోగులుగానే కొనసాగుతున్నారు. పెరుగుతున్న ధరలు, విద్య, వైద్యం, అద్దెలు, నిత్యావసర వస్తువుల ఖర్చుల మధ్య ప్రస్తుత వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు చెబుతున్నారు. ఇంతకాలం సేవలందించినప్పటికీ ఉద్యోగ క్రమబద్ధీకరణ




లేకపోవడం, వేతనాల పెంపు లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన విద్యార్థుల కోసం పనిచేస్తున్న గిరిజనులకే గుర్తింపు లేదు, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అనేక మంది డైలీ వేజ్ కార్మికులు స్వయంగా గిరిజనులే కావడం విశేషం. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కష్టపడుతున్న వీరికి మాత్రం తగిన గుర్తింపు, వేతన భద్రత లేకపోవడం బాధాకరమని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. విద్యార్థుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కష్టపడేవారు మంటల్లో.... కూర్చుని తినేవారు ఏసీల్లో..**

పొద్దున లేస్తే అయ్యో రామచంద్ర అంటూ లేచిన నిద్ర నుండి కళ్ళు తురుముకొని నేరుగా అన్నం పెట్టే ఆశ్రమ పాఠశాల దగ్గరికి వెళ్లి ఈరోజు పిల్లలకు, విద్యార్థులకు ఏం గుర్తించాలని ఆత్రుతతో కష్టపడుతూ ఎండనక వాననక లెక్క చేయకుండా మంట పోయి దగ్గర ఉండి మూడు పూటలా విద్యార్థులకు కడుపునిండా అన్నం పెడుతున్నారు. అలాంటి వారికి సరైన వేతనం ఇవ్వకుండా గత 20 సంవత్సరాల నుండి చాలు చాలు జీవితాలతో రెక్కలు ముక్కలు చేసుకొని డైలీ వేజ్ వర్కర్ గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మరో పక్క కుర్చీలో కూర్చుని తమకు ఇష్టం వచ్చినప్పుడు అప్పుడప్పుడు పలకరిస్తూ ఏసీ రూముల్లో రాజభోగాలు అనుభవిస్తున్నారు. సమాన పనికి సరైన వేతనం ఇచ్చి ప్రభుత్వాలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

**జీవోలతో ప్రయోజనాలా? లేక కోతలా.?**

కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోల వల్ల వేతనాల పెంపు కంటే కోతలే ఎక్కువగా కనిపిస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు ఆరోపిస్తున్నారు. ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, క్రమబద్ధీకరణ వంటి అంశాలపై స్పష్టమైన విధానం లేకపోవడంతో కార్మికుల్లో అనిశ్చితి నెలకొంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు యథాతథంగానే ఉన్నాయి. “మా జీవితాలు ఎప్పుడు మారుతాయి? సమాన పనికి సమాన వేతనం ఎప్పుడు వస్తుంది...? ఉద్యోగ భద్రత ఎప్పుడు కలుగుతుంది?” అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం దొరకడం లేదని కార్మికులు చెబుతున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు కనీస వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సేవల క్రమబద్ధీకరణ, సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న కార్మికుల భవిష్యత్తును కూడా ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్వరాష్ట్రం సాధించిన తెలంగాణలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల జీవితాల్లో కూడా వెలుగులు నిండే రోజు ఎప్పుడు వస్తుందో అని వెయ్యి కళ్ళతో వేచి చూస్తున్నారు

---

**అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు**

# మూడు నెలల్లోనే ప్రాజెక్టుల భూసేకరణ పూర్తి చేయాలి

**రైతులతో చర్చించి అవార్డులు పూర్తి చేయాలని సూచన**

వనపర్తి, జూన్ 9 (మనం న్యూస్) : జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను రానున్న మూడు నెలల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను అధికారులు ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు.

**ప్రాధాన్యంగా మూడు ప్రాజెక్టులు**

బుద్ధారం పెద్ద సముద్రం ప్రాజెక్టుకు సంబంధించి 101 ఎకరాలు, గణప సముద్రం ప్రాజెక్టుకు 164 ఎకరాలు, తూముకుంట-సంగినేనిపల్లి కల్వకు సంబంధించిన 94 ఎకరాల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా భూములకు సంబంధించి మొత్తం రైతుల సంఖ్య, పట్టాదారుల వివరాలతో సమగ్ర డేటా సిద్ధం చేయాలన్నారు.

**రైతులతో నేరుగా చర్చలు**

జిల్లాస్థాయి నెగోసియేషన్ కమిటీని ఏర్పాటు చేసి తేదీలు ఖరారు చేసి క్షేత్రస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. నష్టపరిహారం అంశంపై రైతులతో చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సమావేశాల గురించి ముందుగానే రైతులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. జులై మొదటి వారంలోగా ఆయా భూములకు సంబంధించిన అవార్డుల ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు ముమ్మరంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సూర్యప్రకాశ్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరామర్శ



ఉప్పునుంతల, జూన్ 9 (మనం న్యూస్): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రైతు ర్యాపాని ఆంజనేయులు ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం లక్ష్మాపూర్ గ్రామాన్ని సందర్శించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి బాధను పంచుకుంటూ ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ తనవంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాల్వ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించడం పట్ల గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ నాయకుడు నిరంజన్ గౌడ్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాళి

## కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా



ఉప్పునుంతల, జూన్ 9 (మనం న్యూస్): మండలంలోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీఎల్ఏ నిరంజన్ గౌడ్ మంగళవారం మృతి చెందడంతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దాసర్లపల్లి గ్రామానికి చేరుకుని నిరంజన్ గౌడ్ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖాన్ని పంచుకుని మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, నిరంజన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలందించిన నాయకుడని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అలాగే కుటుంబ అవసరాల కోసం తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నిరంజన్ గౌడ్ ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని, ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి తోడుగా ఉంటారని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో దాసర్లపల్లి గ్రామ సర్పంచ్ బోధనపల్లి రమేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మామిళ్లపల్లి సర్పంచ్ మొకురాల మోహన్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కాల్వ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని నిరంజన్ గౌడ్‌కు నివాళు లర్పించారు.

# హైదరాబాద్ బయలుదేరిన మహిళా సంఘ ప్రతినిధులు




ఉప్పునుంతల, జూన్ 9 (మనం న్యూస్): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా సంఘాల బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప్పునుంతల మండలం నుంచి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు తరలి వెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఇందిరా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు ఉత్సాహంగా బయలుదేరారు. మహిళా సంఘాల కార్యకలాపాల విస్తరణ, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పునుంతల మండలం నుంచి కూడా మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి మండల మహిళా సమాఖ్య ప్రతినిధులతో పాటు ఐకెపి ఏపీఎం బాలచందర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీసీ) పద్మ, వివిధ గ్రామాల బుక్ కీపర్లు, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి వెళ్లే ముందు మహిళలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వల్ల గ్రామీణ ప్రాంత మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని, ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయని మహిళా సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. మహిళల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. పాల్గొన్న మహిళలు బస్సుల ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించి, మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన పొందారు. కార్యక్రమం విజయవంతం కావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.



# విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిరక్షించాలి

## తహసీల్దార్‌కు కంసానిపల్లి గ్రామస్థుల వినతిపత్రం

ఉప్పునుంతల, జూన్ 9 (మనం న్యూస్): మండలంలోని కంసానిపల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గ్రామకంఠం ప్రభుత్వ భూమిలో కేటాయించిన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ గ్రామస్థులు మండల తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం, సర్వే నంబర్ 147లోని 1.10 ఎకరాల ప్రభుత్వ భూమిని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించగా, ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా దున్నినట్లు ఆరోపించారు. గ్రామానికి అవసరమైన విద్యుత్ సౌకర్యాల మెరుగుదల కోసం సబ్‌స్టేషన్ ఏర్పాటు అత్యవసరమని, నిర్మాణానికి ఆటంకాలు కలిగించే చర్యలను అరికట్టాలని వారు కోరారు. రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలాన్ని రక్షించి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్టా శేఖర్‌రెడ్డి, కంసానిపల్లి తండా సర్పంచ్ కాత్రావత్ వాల్య నాయక్, మాజీ ఎంపీటీసీ కొట్టే శ్రీనివాసులు, చింతల నాగరాజు, రామకృష్ణ, యువ నాయకులు మర్యాద లక్ష్మీనరసింహారెడ్డి, భయ్యా నరేష్, మాచర్ల చంద్రు, దొడ్డు ఎల్లయ్య, కాత్రావత్ లచ్చు, గజ్జ శైలు, బొల్లు మల్లయ్య, మూడావత్ రెడ్యా నాయక్ తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.



# మాయ మాటలకు మోసపోవద్దు..

## అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు ఆయుధం

### కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో ఎస్సై పుట్ట మహేష్ అవగాహన

ఉప్పునుంతల, జూన్ 9 (మనం న్యూస్): సైబర్ నేరగాళ్ల మాయ మాటలకు మోసపోయి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ గౌడ్ ప్రజలకు సూచించారు. మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పలు కీలక అంశాలపై ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మొబైల్ నంబర్లు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు, ఆధార్ సంబంధిత సమాచారం వంటి వ్యక్తిగత వివరాలను అపరిచితులకు తెలియజేయడం వల్ల ఆర్థిక మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. బ్యాంకు అధికారులు లేదా ప్రభుత్వ ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసే వ్యక్తుల మాటలను నమ్మరాదని, ఎలాంటి పరిస్థితుల్లోనూ రహస్య సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, సైబర్ మోసాలకు సంబంధించిన సందేశాలు లేదా కాల్స్ వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, తప్పుడు మార్గాల్లో నడిచి తమ భవిష్యత్తును ప్రమాదంలో పడవేయవద్దని హితవు పలికారు. సమాజ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో కంసానిపల్లి తండా సర్పంచ్ వాల్య నాయక్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్ట శేఖర్ రెడ్డి, యువకులు, యువజన సంఘాల సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామస్థులు సైబర్ భద్రత, సామాజిక బాధ్యతలపై అవగాహనపెంపొందించుకోవాల్సిన అవసరాన్ని కార్యక్రమం నొక్కిచెప్పింది. డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలు అధికమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసు శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నేరాల నివారణకు దోహదపడుతున్నాయి. ముఖ్యంగా యువతలో డ్రగ్స్, బెట్టింగ్‌లపై చైతన్యం కల్పించడం సామాజిక ఆరోగ్యానికి అవసరమైన చర్యగా భావించవచ్చు.

# సుధాకర్ రెడ్డికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పరామర్శ



వనపర్తి, జూన్ 9 (మనం న్యూస్) : వనపర్తి మండలం రాజపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వేణు రెడ్డి, సుదర్శన్ రెడ్డిల సోదరుడు సుధాకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు. వనపర్తి పట్టణంలోని బండారు నగర్‌లో ఉన్న సుధాకర్ రెడ్డి నివాసానికి వెళ్లిన నిరంజన్ రెడ్డి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స తీసుకోవాలని, మనోధైర్యంగా ఉండాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ఉంగ్లం తిరుమల్, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, లక్ష్మణ్ గౌడ్, పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీ కూలీ రేట్లు పెంచాలి

### సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్



కొత్తకోట, జూన్ 9(మనం న్యూస్ ) : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని సివిల్ సప్లై హమాలి కార్మికుల కూలి రేట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తకోట సివిల్ సప్లై గోదాం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలి కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.29 కూలిని రూ.35కు పెంచాలని కోరారు. మహిళా స్వీపర్లకు రూ.10 వేల బోనస్ ఇవ్వడంతో పాటు యూనిఫామ్ కుట్టు చార్జీలను కూడా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, గోదాముల వద్ద తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని కోరారు. పీఎఫ్ ఆధారంగా 60 ఏళ్లు పైబడిన హమాలి కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని విజ్ఞప్తి చేశారు. హమాలి కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలి కార్మిక సంఘం అధ్యక్షుడు యాదయ్య, సంఘం సభ్యులు నెల్లూరు కురుమన్న, భాస్కర్, రాములు, కృష్ణన్న తదితరులు పాల్గొన్నారు.

# పదర మండలంలో చిరుత పులి గోర్ల కలకలం

పదర, జూన్ 9 (మనం న్యూస్): ఘటనపై అటవీశాఖ అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టగా, ఈ వ్యవహారానికి సంబంధించి మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోదాల అనంతరం ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న గోర్లు నిజంగా చిరుత పులివేననే విషయాన్ని నిర్ధారించేందుకు అధికారులు శాస్త్రీయ పరీక్షలు నిర్వహించే అవకాశముంది. అలాగే ఈ గోర్లు ఎక్కడి నుంచి వచ్చాయి, వేట లేదా అక్రమ రవాణా ముఠాలతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అటవీశాఖ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తు పురోగతిని బట్టి మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 ప్రకారం చిరుత పులి వంటి రక్షిత జంతువులకు చెందిన అవయవాలను కలిగి ఉండటం, విక్రయించడం లేదా అక్రమంగా రవాణా చేయడం తీవ్రమైన నేరం. ఆరోపణలు రుజువైతే నిందితులకు కఠిన శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అటవీశాఖ అధికారులు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నట్లు సమాచారం. పదర మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.



### చారకొండ,జూపల్లి ప్రాథమిక పాఠశాలలలో

# ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్స్,ఆయాలకు దరఖాస్తుల ఆహ్వానం



చారకొండ,జూన్ 09(మనం న్యూస్) : నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు చారకొండ,జూపల్లి లలో ప్రీ-ప్రైమరీ సెక్షన్ల కోసం ఇన్‌స్ట్రక్టర్లు,ఆయాల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం మండల విద్యాధికారి ఝాన్సీ రాణి ప్రకటనలో తెలిపారు.రిజర్వేషన్:ఎంపీపీ ఎస్ చారకొండ ఓసి,ఎంపీపీ ఎస్ జూపల్లి ఎస్సీ-1కి కేటాయించారు.విద్యార్హతలు:ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు ఈ సి ఈ/డిపిఎస్ఇ/నర్సరీ టీచర్ ఎడ్యుకేషన్/డీఈసీఈడ్/టీటీసీ వంటి అర్హతలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.ఆయా:కనీసం7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.వయోపరిమితి: నోటిఫికేషన్ తేదీ నాటికి 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.ప్రభుత్వ నిబంధనల మేరకు వయో సడలింపులు వర్తిస్తాయి.గౌరవ వేతనం: ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8,000/- ,ఆయాకు నెలకు రూ.6,000/-.స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ముందుగా అదే గ్రామం/ఆవాస ప్రాంతం,అనంతరం గ్రామ పంచాయతీ,మండలం,జిల్లా పరిధిలోని అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు 09-06-2026 నుండి 15-06-2026 వరకు సంబంధిత చారకొండ మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు నమూనా పూర్తి వివరాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులోఉన్నాయి.గమనిక.... SC- I అభ్యర్థులు అందుబాటులో లేకపోతే SC-II కేటగిరి కి ప్రాధాన్యత ఇవ్వబడును.మండల విద్యాధికారిని తెలిపారు.



# సంకల్ప సిద్ధి సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు

### గురువారం ప్రత్యేక పూజలు, భజనలు, పల్లకి సేవ

కొత్తకోట, జూన్ 9 (మనం న్యూస్ ): కొత్తకోట పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వెలసిన శ్రీ శ్రీ శ్రీ సంకల్ప సిద్ధి సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. దాదాపు 12 సంవత్సరాల క్రితం ప్రకృతి రమణీయతల మధ్య అత్యంత సుందరంగా నిర్మించిన ఈ ఆలయం భక్తుల విశేష ఆదరణ పొందుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా కొనసాగుతోంది. ఆలయంలో షిరిడీ సాయిబాబాతో పాటు ఓంకారేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, వినాయకుడు, నాగదేవతలు కొలువై భక్తుల కోరికలు తీర్చే దైవాలుగా పూజలు అందుకుంటున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు విశేష అభిషేకం, 8 గంటలకు పుష్పార్చన, 9 గంటలకు మహా హారతి నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుంది. ఉదయం 11 గంటలకు కొత్తకోట మున్సిపాలిటీ నూతన కౌన్సిల్ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడతారు. సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు పల్లకి సేవ, రాత్రి 8.30 గంటలకు శేజ హారతితో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# జూపల్లిలో మట్టి తవ్వకాలను ఆర్ఐ, జిపిఓ పరిశీలన

చారకొండ,జూన్09(మనం న్యూస్) : జూపల్లి శివారులోని చింతచెరువులో నల్ల మట్టి తవ్వకాలను రెవిన్యూ ఇన్స్పెక్టర్ భరత్ గౌడ్,జిపిఓ శంకర్ లు చెరువు దగ్గరికి వెళ్లి పరిశీలించారు.చింతచెరువు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరపడంతో సోమవారం చెరువు నుండి మట్టి తరలింపును సమీప రైతులు అడ్డుకోని ఆందోళన చేశారు.రైతులు పలువురు అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం తాసిల్దార్ ఆదేశాల అధికారులు చెరువులోని తవ్వకాలు చేపట్టిన స్థలాన్ని పరిశీలించి పెంచనామా నిర్వహించారు.



# రూ.5,990 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక విడుదల

**అర్హులైన రైతులు, విద్యార్థులు, స్వయం ఉపాధి లబ్ధిదారులకు రుణాలివ్వడంలో బ్యాంకులు చొరవ చూపాలి**

**లక్ష్యాలను అధిగమించిన మూడు బ్యాంకులకు కలెక్టర్ అభినందనలు**



వనపర్తి, జూన్ 9 (మనం న్యూస్) : జిల్లాలో రైతులు, విద్యార్థులు, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), మెప్మా సంఘాలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాల మంజూరులో బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరులో ఆలస్యం లేకుండా సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని బ్యాంకర్లకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల రుణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, విద్య, స్వయం సహాయక సంఘాలు, ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరును కేటగిరీవారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.5,990 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ప్రభుత్వం, బ్యాంకులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని సూచించారు.



## సిబిల్ స్కోర్‌తోనే తిరస్కరణ వద్దు

రుణాల మంజూరులో సిబిల్ స్కోర్‌ను ఒక ప్రమాణంగా పరిగణించినప్పటికీ, అర్హులైన రైతులు, విద్యార్థులు, స్వయం ఉపాధి లబ్ధిదారులు రుణాల కోసం తిరస్కరణకు గురికాకుండా బ్యాంకులు వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. కొన్ని బ్యాంకులు ప్రభుత్వ పథకాల అమలులో వెనుకబడినట్లు గుర్తించామని, అలాంటి బ్యాంకులు వెంటనే పనితీరును మెరుగుపరుచుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

## ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, పీఎం స్వనిధి తదితర పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. రుణాల మంజూరులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు.

## బీమా పథకాల లక్ష్యాలు సాధించాలి

సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల కింద ప్రతి బ్యాంకు లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖాతాదారులందరికీ ఈ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల కింద రుణాలు పొందే ప్రతి లబ్ధిదారునికి బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు.

## విద్యార్థుల రుణాల్లో ఆలస్యం చేయొద్దు

ఉన్నత విద్యాభ్యాసం, విదేశీ విద్య కోసం విద్యార్థులకు అవసరమైన విద్యా రుణాలను నిబంధనల మేరకు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. అధిక మొత్తంలో రుణాలు అవసరమైన విద్యార్థుల దరఖాస్తులను కూడా పరిశీలించాలని బ్యాంకర్లను కోరారు.

## మూడు బ్యాంకులకు ప్రశంసలు

స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో లక్ష్యాలను అధిగమించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్‌ల ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి మెమెంటోలు అందజేశారు.

## కొత్త కోర్సులు ప్రారంభించాలి

జిల్లా కేంద్రంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్లంబింగ్, కుకింగ్, ఏసీ రిపేర్ వంటి ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణా కోర్సులకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.

## రూ.4,943 కోట్ల రుణాల మంజూరు

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రూ.5,339 కోట్ల వార్షిక రుణ లక్ష్యానికి గాను జిల్లాలోని బ్యాంకులు రూ.4,943 కోట్ల రుణాలు మంజూరు చేశాయని తెలిపారు. ఇది మొత్తం లక్ష్యాల్లో 92.58 శాతం సాధన అని పేర్కొన్నారు. నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సర ప్రణాళిక కోసం వివిధ శాఖల నుంచి సమాచారం సేకరించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్బీఐ ఎల్డీఓ డాక్టర్ ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఏజీఎం మురళీకృష్ణ, ఎస్బీఐ ఆర్ఎం శ్రీచరణ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, ఇతర బ్యాంకు ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

---

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**ప్రజాస్వామ్య నాలుగో స్తంభమైన విలేకరుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలి : సీపీఎం**

**అచ్చంపేట మండల కార్యదర్శి వర్దం సైదులు డిమాండ్**



అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం అచ్చంపేట మండల కార్యదర్శి వర్దం సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా జర్నలిస్టులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని గ్రామీణ స్థాయి వరకు చేరవేయడంలో విలేకరుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడం, సామాన్య ప్రజల గొంతుకగా నిలవడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని అన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ప్రమాదకర పరిస్థితులు, ప్రకృతి విపత్తుల సమయంలో సైతం ప్రాణాలకు తెగించి వార్తలను ప్రజలకు చేరవేస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అయితే, సమాజానికి నిరంతరం సేవలు అందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం విషయంలో ప్రభుత్వాలు సరైన దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది జర్నలిస్టులు తక్కువ ఆదాయంతో, ఎలాంటి గౌరవ వేతనం లేకుండా సామాజిక బాధ్యతతో వృత్తిని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు గత 14 సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

---

# మాల మహానాడు..పోలీసు సన్మాన వైభవం

## సన్మాన ఘట్టం..సముచితం

మాల మహానాడు నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాసులు



ఊరుకొండ మే 9 (మనం న్యూస్) : ఊరుకొండ మండల పరిధిలో మంగళవారం ఇటీవల అధికారికంగా బాధ్యతలు చేపట్టిన పోలీస్ అధికారి అధికారిని నాగర్కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాసులు మాల శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలో మాల మహానాడు ఉపాధ్యక్షుడు ప్రసంగిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణలో సదా.. అప్రమత్తమైన పోలీసు అధికారిని సమాజ శ్రేయస్సును కాంక్షించే మాల మహానాడు నీరాజనం పలికింది.

## సన్మాన ఘట్టం..సముచితం

నిరంతరం ప్రజాసేవలో తరిస్తూ..చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోకుండా,బాధితులకు అండగా నిలిచే స్థానిక పోలీసు అధికారిని గుర్తించి,సన్మానించడం ఎంతో అభినంద నీయం. ఈ సత్కారం ద్వారా పోలీసు శాఖకు..ప్రజలకు మధ్య ఉన్న సంబంధాలు మరింత బలపడతాయని కాంక్షించారు.

## ప్రజా సమస్యలు..పరిష్కారంలో

గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ.. సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణ నెలకొల్పడంలో స్థానిక పోలీస్ పాత్ర అమోఘం అంటూ,రాత్రింబవళ్లు తేడా లేకుండా ప్రజల రక్షణ ధ్యేయంగా పనిచేస్తున్న ఆ అధికారిని మాల మహానాడు శ్రేణులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ మర్యాదపూర్వక సన్మానం వారిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని ప్రగాఢంగా విశ్వసించారు.

## మహానాడు ఆశయం.. సమసమాజ నిర్మాణం

అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న మాల మహానాడు,అటు సామాజిక సేవతోపాటు..ఇటు ప్రజా రక్షణలో భాగస్వాములైన అధికారులను ప్రోత్సహించడం గొప్ప పరిమాణం. శాంతిభద్రతల ఉంటేనే సమాజాభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో పోలీసుల సేవలను గుర్తించడం అందరికీ ఆదర్శంగా నిలవడం లో అతిశయోక్తి లేదని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమం ద్వారా సమాజంలో పోలీసుల మీద గౌరవం బాధ్యత మరింత ఇనుమడిస్తుం దని ప్రశంసించడం జరిగింది. రక్షక లంటేనే ఊరికి రక్షణ.. సమాజానికి లక్ష్మణ రేఖ అని మాల మహానాడు ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సన్మానం చూసి..చుట్టుపక్కల జనం రక్షకభట అధికారునికి..తగ్గ సంస్కారం సత్కారం భలే కుదిరింది వ్యవహారం అంటూ మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మేకల నిర్మల. జిల్లా మహిళా కార్యదర్శి కనక భారతి,మార్చాల గ్రామ అధ్యక్షుడు సామరాజు,డివిజన్ ఉపాధ్యక్షులు సామ బాలరాజు,దువ్వాసి యాదయ్య,సీనియర్ నాయకులు శీను రిపోర్టర్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులు నేల సారవంతాన్ని పెంచుతాయి

## మండల వ్యవసాయ అధికారిని తనుజ రాజ్



చారకొండ,జూన్09(మనం న్యూస్) : పశువులు,గొర్రెల ఎరువు భూమికి అవసరమైన సేంద్రియ బలాన్ని ఇచ్చి,నేల సారాన్ని పెంచుతాయని మండల వ్యవసాయ అధికారిని తనుజ రాజ్ అన్నారు. మంగళవారం ఏవో ప్రకటనలో తెలుపుతూ సేంద్రియ ఎరువులు భూమిలో తేమను నిల్వ ఉంచుతూ,మొక్కలకు పోషకాలను సమతుల్యంగా అందిస్తాయని,రసాయన ఎరువుల ఖర్చును తగ్గించి,సేంద్రియ ఎరువులు వాడటం వలన నేల జీవశక్తిని కాపడతాయి అన్నారు.దీనివల్ల పంట దిగుబడి పెరగడమే కాకుండా,నాణ్యత కూడా మెరుగుపడుతుంది.దీర్ఘకాలికంగా భూమిని ఆరోగ్యంగా ఉంచడంలో ఇవి అత్యంత ప్రభావవంతమైనవి,కనుక మండల రైతులు సేంద్రియ వాడటం అలవాటు చేసుకోవాలని ఆమె ప్రకటనలో సూచించారు.

# నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఇసుక నిల్వలు

## పూర్తి స్థాయి విచారణకు ప్రజల డిమాండ్

జడ్చర్ల, జూన్ 09, మనం న్యూస్ : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కార్యకలాపాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో నాలుగో వార్డు పరిధిలో వెలుగులోకి వచ్చిన భారీ ఇసుక డంపింగ్ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వే నెంబర్ 114, 113 ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున ఇసుకను తరలించి నిల్వ చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వలకు ప్రభుత్వ నియమాలు కఠినంగా ఉన్నప్పటికీ, ఈ ఘటనలో అవి పూర్తిగా ఉల్లంఘించబడ్డాయని ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను తరలించి గుట్టలుగా వేసినట్లు సమాచారం ఉండగా, దీనిపై సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ ఇసుక వ్యాపారం వల్ల ప్రభుత్వానికి ఆదాయం కోల్పోవడమే కాకుండా, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో ఇలాంటి డంపింగ్ కేంద్రాలు భవిష్యత్తులో అనధికార లేఅవుట్లకు, నిర్మాణాలకు దారి తీసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు చెబుతున్న వివరాల ప్రకారం, కొంతకాలంగా ఈ ప్రాంతంలో అనుమానాస్పదంగా వాహనాల రాకపోకలు పెరిగినా, ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడు మాత్రం పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు కనిపించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొంటున్నారు. సంబంధిత రెవెన్యూ, మైనింగ్, మున్సిపల్ శాఖలు పరస్పరం బాధ్యతలు మోపుకుంటూ కాలయాపన చేస్తే అక్రమాలకు ఊతమిచ్చినట్లే అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ ప్రాంతాన్ని పరిశీలించి, ఇసుక ఎక్కడి నుంచి తెచ్చారు, ఎవరు నిల్వ చేశారు, ఎవరి అనుమతులతో ఈ పని జరిగింది అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు. అధికార యంత్రాంగం ఈ అంశాన్ని ఎంత త్వరగా, ఎంత పారదర్శకంగా పరిష్కరిస్తుందో అన్నదానిపై స్థానిక ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# కర్ణాటక లో నీరా, టాడి పై నిషేధాన్ని ఎత్తివేసి, కులవృత్తులను ఆదుకోవాలి

## మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్, 09జూన్, (మనం న్యూస్) : కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బీకే హరిప్రసాద్ గౌడ్ ని, వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయ స్వామి గౌడ ని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం కర్ణాటక ఓబీసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. కర్ణాటక రాష్ట్రంలో వృత్తి ఆధారిత కులాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర మాదిరిగా కర్ణాటకలో నీరా, టాడి విక్రయాలను పునరుద్ధరించి, వైన్ షాపుల కేటాయింపులలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు.రాష్ట్ర శాసనసభ ప్రాంగణం ముందు శ్రీ నారాయణ గురు విగ్రహాన్ని ఏర్పాటుచేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తాటి, ఈత, కొబ్బరి చెట్ల నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు, అదేవిధంగా వాటి అభివృద్ధి కోసం ప్రత్యేక పరిశోధనలు జరిపి హైబ్రిడ్ రకాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కర్ణాటక రాష్ట్రంలో సుమారు 40 లక్షల గౌడ జనాభా ఉన్నప్పటికీ, టాడి విక్రయాలపై నిషేధం కారణంగా వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. నిషేధాన్ని ఎత్తివేసి తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా సొసైటీలు, టిఎఫ్టి ల ద్వారా నీరా మరియు దాని ఉప ఉత్పత్తులను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర మాదిరిగా ముదిరాజులకు ఉచిత చేప పిల్లలు, మోపెడ్లు, డీసీఎం లను మరియు కురుమ యాదవులకు గొర్రెలను పంపిణీ చేయడంతో పాటు వివిధ కులవృత్తులను ప్రోత్సహించిన విధంగా కర్ణాటక రాష్ట్రంలో వృత్తికులాలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఓబీసీ అధ్యక్షులు బాలరాజు గుత్తేదార్, నారాయణ కురుబ, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సంతోష్ గోగి, కర్ణాటక గౌడ సంఘం అధ్యక్షులు సంతోష్ గుత్తేదార్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు



మహబూబ్ నగర్, 09జూన్, (మనం న్యూస్) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైకార్ ద్వారా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలపై గిరిజన యువతకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. య-ువతలో నైపుణ్యాలను పెంపొందించడం, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడం, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో లభించే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను పొందాలంటే సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన శిక్షణ ఎంతో అవసరమని ఆయన అన్నారు. ముఖ్యంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయగలమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గిరిజన యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన యువతి, యువకులకు నిపుణులైనా ముగ్గురు కౌన్సెలర్ల ద్వారా ప్రేరణాత్మక (మోటివేషన్) శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయాలతో పాటు వివిధ ట్రేడ్లలో అందించే ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, వాటి ద్వారా లభించే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. అలాగే గిరిజన యువత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ స్వయం ఉపాధి పథకాలపై కూడా అవగాహన కల్పించారు. యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు హైదరాబాద్‌లోని మెగా స్కిల్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కోర్సును బట్టి శిక్షణ కాలవ్యవధి మూడు నుంచి ఆరు నెలల వరకు ఉంటుందని చెప్పారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదు-పాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.డొమైన్ , నాన్-డొమైన్ అంశాలలో నైపుణ్య శిక్షణ అందించబడుతుందని తెలిపారు. డొమైన్ కోర్సుల్లో టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీషియన్ కోర్సులు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ తదితర కోర్సులు ఉంటాయి. నాన్-డొమైన్ అంశాల్లో సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యాలు వంటి అంశాల్లో శిక్షణ అందించబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మలా, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి యం.ఛత్రు నాయక్, కౌన్సిలింగ్ నిపుణులు రవి శంకర్, పి. రాంబాబు, నేహా డాలీ, గిరిజన యువతి, యువకులు, డి.టి.డి.ఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ధ్యేయం.. మూతబడిన బస్టాండ్‌కు త్వరలోనే పునరుజ్జీవం

**లింగాలలో విస్తృత పర్యటన నిర్వహించిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

**ప్రజా సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు**



అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం లింగాల పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ ప్రాంతంలోని టీ, టిఫిన్ సెంటర్లను సందర్శించి సామాన్య ప్రజలు, వ్యాపారులతో ముచ్చటించారు. వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత కొంతకాలంగా మూతబడి నిరుపయోగంగా మారిన లింగాల బస్టాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు. బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మించి ప్రయాణికులు, విద్యార్థులకు మెరుగైన రవాణా సదు-పాయాలు కల్పిస్తామని చెప్పారు. బస్టాండ్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు వేగవంతంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న బస్టాండ్ సమస్యతో పాటు ఇతర సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఇబ్బందుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. పట్టణ కేంద్రాల అభివృద్ధి, రవాణా వ్యవస్థ బలోపేతం, ప్రజా సౌకర్యాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. లింగాల బస్టాండ్ పునర్నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుద్దయ్య, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు మరో ముందడుగు



**ఇందిరా మహిళా శక్తి పథకంలో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు**

**లింగాల, చెంచు మండలాల మహిళా సంఘాల సభ్యులు పంపిణీ కార్యక్రమానికి తరలింపు**

**బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు 553 ఆర్టీసీ అద్దె బస్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు లింగాల మండల మహిళా సమాఖ్య, చెంచు మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు రెండు బస్సుల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులను తీసుకెళ్లే బస్సులను ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను కేవలం పొదుపు సంఘాల సభ్యులుగానే కాకుండా ఆదాయ వనరులు సృష్టించుకునే పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను అందజేయడం వల్ల మహిళలు ప్రత్యక్షంగా ఆదాయాన్ని పొందే అవకాశం కలుగుతుందని, తద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మహిళా సంఘాల ప్రతినిధులకు బస్సులను పంపిణీ చేయడం మహిళా సాధికారతకు నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుద్దయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐకేపీ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

**ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు**

**ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరిక**



అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అమ్రాబాద్ మండలం బికే ఉప్పునుంతల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలు, రైతులు, మహిళలు, యువత, పేదల కోసం చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకర్షించాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాల పట్ల విశ్వాసం పెరిగి పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, య-ువత ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై విశ్వాసంతో చేరుతున్న ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రహీమ్, గ్రామ అధ్యక్షులు దస్తగిరి, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# మాగనూర్ మండలానికి ఇందిరా మహిళా శక్తి ద్వారా Tgsrtc బస్సు

మాగనూర్ జూన్ 9(మనం news) : మాగనూర్ మండల మహిళా సమాఖ్యకు ఇందిరా మహిళా శక్తి ద్వారా TGRTC బస్సు ను ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాగనూర్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆనందగౌడ్, మహిళా సమైక్య అధ్యక్షురాలు, ఐకేపీ సిబ్బంది, మహిళా సమాఖ్య సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# రోడ్డు ఆక్రమణలు, స్క్రాప్ వ్యర్థాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**ఫైర్ స్టేషన్ కాలనీలో పెరుగుతున్న అగ్ని ప్రమాదాల ముప్పు**

**తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కాలనీవాసుల వినతి**

అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఫైర్ స్టేషన్ కాలనీలో రోడ్డు ఆక్రమణలు, స్క్రాప్ వ్యర్థాల నిల్వ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్‌కు ప్రజావాణి ద్వారా వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీకి ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో ఓ స్క్రాప్ వ్యాపారి పాత వాహనాలు, ఇనుప సామగ్రి, బీరు సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు తదితర స్క్రాప్ పదార్థాలను రోడ్డుపై మరియు రోడ్డుకు ఇరువైపులా నిల్వ ఉంచుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం 24 అడుగుల వెడల్పు ఉన్న రహదారి ప్రస్తుతం వ్యర్థాల నిల్వతో కుదించుకుపోయి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోందన్నారు. ప్రత్యేకించి విద్యార్థులు, మహిళలు, వృద్ధులు మరియు వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో ఈ వ్యర్థాల నుంచి మురికి నీరు కాలనీలోకి చేరి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని, దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే స్క్రాప్ కుప్పల మధ్య పాములు, విషపూరిత జీవులు ఆశ్రయం పొందుతున్నాయని, ఇప్పటికే కొన్ని సందర్భాల్లో పాములు ఇళ్లలోకి ప్రవేశించిన ఘటనలు చోటుచేసుకున్నా యని కాలనీవాసులు తెలిపారు. దీంతో ప్రజలు భయాందోళన లకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక ప్లాస్టిక్, టైర్లు వంటి సులభంగా మంటలు అంటుకునే పదార్థాలను ఎటువంటి భద్రతా చర్యలు లేకుండా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాల ముప్పు కూడా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ అగ్ని ప్రమాదం సంభవిస్తే సమీపంలోని నివాస గృహాలు, ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో కూడా రోడ్డు ఆక్రమణలు పెరిగిపోతున్నాయని, దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున మున్సిపల్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, ప్రభుత్వ రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించడంతో పాటు ప్రమాదకర వ్యర్థాలను తొలగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ప్రజావాణి ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యం, ప్రజా భద్రత దృష్ట్యా అధికారులు అత్యవసరంగా స్పందించాలని కోరారు.



# జాతీయ రహదారిని ఆనుకొని ఇంటి నిర్మాణం అడ్డుకునేది ఎవరు

జడ్చర్ల, జూన్ 09, మనం న్యూస్ : జడ్చర్ల మున్సిపాలిటీ పట్టణ పరిధిలో జాతీయ రహదారి నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పట్టణంలోని మూడో వార్డు పరిధిలో సర్వే నెంబర్ 152లో కొందరు వ్యక్తులు చేపడుతున్న నిర్మాణాలు జాతీయ రహదారి భద్రతా ప్రమాణాలు, మున్సిపల్ నియమాలు, మరియు పట్టణ ప్రణాళిక మార్గదర్శకాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రారంభ దశలో ఈ నిర్మాణాలను నిరోధించాల్సిన సంబంధిత అధికారులు తమ బాధ్యతలను నిర్లక్ష్యం చేసినట్టు స్థానిక ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నిర్మాణదారులు మొదట "తమ స్థలంలోనే చిన్న ఇల్లు కట్టుకుంటున్నాం" అంటూ అమాయకత్వాన్ని ప్రదర్శించినప్పటికీ, నిర్మాణం పూ-ర్తయ్యాక అది నిబంధనలకు విరుద్ధంగా ఉందని అధికారులు గుర్తించగానే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. అప్పటివరకు మౌనంగా ఉన్న వారు ఒక్కసారిగా అధికారులపై ఆరోపణల వర్షం కురిపిస్తూ, "అన్ని అనుమతులు అధికారులే ఇచ్చారు" అంటూ బాధ్యతను తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. ఇక ఈ ఘటనలో అత్యంత ఆందోళన కలిగించే అంశం మురుగునీటి పారుదల మార్గాలను సైతం ఆక్రమిస్తూ నిర్మాణాలు కొనసాగుతుండటమే. పట్టణంలో భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తే ప్రమాదాన్ని పట్టించుకోకుండా, స్వార్థపూరిత ధోరణితో వ్యవహరిస్తున్న నిర్మాణదారుల చర్యలు ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా జాతీయ రహదారి 167 అనుకొని చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించిన కట్టుదిట్టమైన నియమాలు అమలులో ఉండాల్సినప్పటికీ, అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు ఈ నిర్మాణాలకు ఎలా అనుమతులు మంజూరు చేశారు? ఒకవేళ వారు అనుమతులు ఇవ్వకపోతే, జాతీయ రహదారి అధికారుల పర్యవేక్షణ ఎందుకు కనిపించలేదు? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల మధ్య తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. నిర్మాణాలు ప్రారంభ దశలో ఉన్నప్పుడే అవి నిబంధనలకు విరుద్ధమని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, ఆ దశలో అలక్ష్యం ప్రదర్శించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఆలస్యంగా స్పందిస్తూ నిర్మాణాలు పూర్తయ్యాక చర్యలు తీసుకోవడం ప్రజలలో అనుమానాలకు తావిస్తోంది. ఈ పరిస్థితి ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తూ, పరిపాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ప్రస్తుతం ప్రజలు ఒక్కసారిగా చట్టపరమైన కఠిన చర్యల కోసం డిమాండ్ చేస్తూ, సంబంధిత మున్సిపల్ అధికారులు మరియు జాతీయ రహదారి 167 విభాగం అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ నిర్మాణాలను గుర్తించి, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు మరింత పెరిగి, పట్టణ అభివృద్ధి మరియు రహదారి భద్రతపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఖరీఫ్ వేళ ఆరోగ్యం..మన మేల!!

**సబ్బండ ప్రజలకు..సత్వర వైద్యం!!**

**ఊరుకొండ వైద్యాధికారి డా శివ కృష్ణ.**



ఊర్కొండ జూన్ 9 (మనం న్యూస్) : ఊరుకొండ మండల వ్యాప్తంగా ప్రారంభం కాబోతున్న ఖరీఫ్..కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంగళవారం అంటూ వ్యాధులు ప్రబలకుండా,గ్రామాలలో ఆశా కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నామని స్థానిక వైద్యాధికారి శివకృష్ణ తెలియజేశారు.ఈ నేపథ్యంలో వ్యాఖ్యానిస్తూ గగనం..కమ్ముకున్న మేఘాలు.ధరణి పులకరించిన..ఖరీఫ్ వేళలు..వానలు కురిసే కాలంలో అంటూవ్యాధులు సైతం చుట్టుముట్టు పొంచి ఉండే ప్రమాదం ఉందని,దోమల స్వైర విహారం,కలుషిత నీరు,ఆహారం,ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తతతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కష్టకాలంలో భయపడాల్సిన అవసరం లేకుండా మన ప్రాణాలను కాపాడుకునేందుకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించేందుకు మన ఆరోగ్య మిత్రలో నిరంతరం అందుబాటులో ఉంటారని నినదించారు.

**అడుగడుగునా..సాయం**

ఖరీఫ్ కాలంలో పొలం పనులతో బిజీగా ఉండే రైతన్నలకు గ్రామస్తులకు ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్లు నిరంతరం సహాయం అందించడంలో ముందుంటారు.జ్వరం,దగ్గు,మలేరియ,డయేరియా,డెంగ్యూ వంటి రోగాలు రాకుండా ముందస్తు మందులు పంపిణీ చేసున్నారు.

**పరిశుభ్రత మన..ఆరోగ్యం**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత. నీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమల బెడద తగ్గుతుంది.దోమల తెరలు వాడకం,కాచి వడపోసిన నీరు త్రాగటం.వంటి ఆరోగ్య సూత్రాలను ప్రజలకు నిత్యం వివరిస్తున్నారని ఆకాంక్షించారు.వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటూ మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకుందాం. "వైద్యో..నారాయణో హరి"అన్న నానుడిని నిజం చేస్తూ అంటు వ్యాధులపై సమరభేరి.. మోగించాలని, ఆరోగ్య కార్యకర్తలు..అందరిని మనస్ఫూర్తిగా అప్రమత్తం చేయడంలో వైద్య డాక్టర్ నిష్ణార్థులుగా ప్రధాన పాత్రను పోషిస్తూ,ఖరీఫ్ కాలాన్ని..ఆరోగ్యకరమైన కాలంగా మార్చుకుందాం అంటూ ప్రతినబునారు..

# కల్వకుర్తి మండలానికి 6 ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరు

**ఉపాధ్యాయులు, ఆయాల పోస్టులకు ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**ఎంఈవో- శంకర్ నాయక్**



కల్వకుర్తి రూరల్, జూన్ 09 (మనం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి మండలానికి ఈ విద్యా సంవత్సరానికి 6 ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరైనట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శంకర్ నాయక్ తెలిపారు. ఈ పాఠశాలలను మండలంలోని ఎల్లికల్, తోటపల్లి, తాండ్ర, లింగసానిపల్లి, ఎల్లికట్ట గ్రామాలతో పాటు కల్వకుర్తి మండల కేంద్రంలోని బాల్‌రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రతి పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు, ఒక ఆయాను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు టిటిసి లేదా ప్రీ-ప్రైమరీ శిక్షణ పూర్తి చేసిన స్థానిక అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులై స్థానికంగా ఉండే మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులకు నెలకు రూ.8,000, ఆయాలకు రూ.6,000 వేతనం అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా కల్వకుర్తి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హతలు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాల కోసం మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని స్థానిక యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# మన ఊరు మన బడి

మాగనూరు జూన్9 (మనం న్యూస్) : మన ఊరు మన బడి కార్యక్రమంలో మాగనూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, సర్పంచ్ తనయుడు సత్యనారాయణ, వార్డుమెంబరులు,జూరా హెడమాస్టర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదువాలని ప్రచారం చేసారు.



# క్రమశిక్షణ, కఠిన సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి

**ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ**

**సమ్మర్ క్యాంప్ క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందించిన ఎమ్మెల్యే**

**ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీ క్రీడాకారులకు అభినందనలు**



అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలోని ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులకు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, కఠిన సాధనతో ముందుకు సాగితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించగలరని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక వికాసానికి, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న యువ క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడంలో ఇలాంటి అకాడమీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకొని విజయాలు సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీ కోచ్ జావేద్, నాయకులు గోపాల్ రెడ్డి, రామనాథం, సుంకరి బాలరాజు, క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట, జూన్ 9 (మనం న్యూస్): మండల పరిధిలోని మిరాసిపల్లి గ్రామం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశి రఘు తండ్రి దేశి తిరుపతయ్య  సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామానికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు అతని పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, పార్టీ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని భరోసానిచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లే పాగు ప్రశాంత్, మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి,మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మాసన్నా, నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి, వాహిద్,స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంసానిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంపై అపోహలు నమ్మవద్దు: సర్పంచ్ లలిత



ఉప్పునుంతల, జూన్ 9 (మనం న్యూస్): కంసానిపల్లి గ్రామానికి కేటాయించిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని గ్రామ సర్పంచ్ శ్రీమతి చీమర్ల లలిత వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సర్వే నంబర్ 147లోని 1.10 ఎకరాల ప్రభుత్వ భూమిలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టే ప్రక్రియ కొనసాగుతుందని, ఈ విషయంలో గ్రామ ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, కంసానిపల్లి గ్రామ అభివృద్ధికి ఎంతో కీలకమైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాస్పదం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సబ్‌స్టేషన్‌ను గట్టు కాడిపల్లి, కొరటికల్లు ప్రాంతాలకుతరలిస్తున్నారంటూ కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, అలాంటి ప్రతిపాదన గానీ, నిర్ణయం గానీ ఎక్కడా లేదని స్పష్టం చేశారు. గతంలో గ్రామానికి కేటాయించిన స్థలంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుందని, మాజీ సర్పంచ్ కర్నే లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అప్పగించిన భూమిలోనే ఈ ప్రాజెక్టు అమలవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్పులు లేకపోతే ఇదే స్థలంలో నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను కొందరు రాజకీయ నిరుద్యోగులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆమె విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజల్లో అనుమానాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న వారి ప్రయత్నాలు ఫలించవని అన్నారు. ప్రభుత్వ భూములను గతంలో అక్రమంగా ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు, కాంపౌండ్ గోడలు నిర్మించిన వారే నేడు సబ్‌స్టేషన్ స్థలం ఆక్రమణకు గురవుతుందంటూ మాట్లాడడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల గ్రామ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా సహకరించాలని కోరారు. సబ్‌స్టేషన్ నిర్మాణం ఖచ్చితంగా కంసానిపల్లిలోనే, గతంలో నిర్ణయించిన ప్రభుత్వ స్థలంలోనే జరిగి తీరుతుందని మరోసారి స్పష్టం చేసిన సర్పంచ్ చీమర్ల లలిత వెంకటేశ్వర్లు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గిరిజన విద్యార్థులందరూ ప్రభుత్వ విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో బడిబాట కార్యక్రమం**

**100 శాతం ఉత్తీర్ణతతో ఆదర్శంగా నిలిచిన అచ్చంపేట ఆశ్రమ పాఠశాల**

అచ్చంపేట, జూన్ 9 (మనం న్యూస్): గిరిజన విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత విద్యతోనే ప్రకాశవంతమవుతుందని, ప్రతి గిరిజన బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలలో చేరి ప్రభుత్వ విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగస్వామి పిలుపునిచ్చారు. అచ్చంపేట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు లింగస్వామి, ఉపాధ్యాయ బృందం గిరిజన తండాలు, గూడాయాలను సందర్శించి విద్యార్థుల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. బడి బయట ఉన్న ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, పరిశుభ్రమైన డార్మెటరీలు, విశాలమైన తరగతి గదులు, తగిన వసతి సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మినరల్ వాటర్ అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ కోసం పాఠశాలలో నిరంతరం ఏఎన్‌ఎం సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగానికి అనుగుణంగా విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు ప్రత్యేక కంప్యూటర్ ఉపాధ్యాయుడిని నియమించినట్లు తెలిపారు. అలాగే ప్రత్యేక తరగతులు, సాయంత్రం స్టడీ అవర్స్, నిరంతర ఉపాధ్యాయ పర్యవేక్షణతో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నామని, విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువల పెంపుపై కూడా దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గిరిజన తండాలు, గూడాయాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ పాఠశాల వయస్సు కలిగిన ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్ బస్సు యాత్ర

రేవల్లి, జూన్ 9 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికి చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి రేవల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లు రవి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేవల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బస్సు యాత్ర సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత వంటి సంక్షేమ పథకాలతో పాటు విద్యా రంగంలో చేపట్టిన విప్లవాత్మక మార్పులు, వైద్య రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, సామాజిక న్యాయం సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబాటు, హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలు, తెలంగాణకు భారీ పెట్టుబడుల ఆకర్షణ, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి అంశాలను ప్రజలకు సవివరంగా తెలియజేశారు.

## గొల్లపల్లిలో వెంకటదాసు స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు



ఉమ్మడి గోపాలపేట, జూన్ 9 (మనం న్యూస్): ఏదుల మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామంలో వెలసిన ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వెంకటదాసు స్వామి ఆలయాన్ని మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, ఏదుల గ్రామ సర్పంచ్ పరశురామ్ యాదవ్, ఏదుల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, గొల్లపల్లి గ్రామ సర్పంచ్ సంతోషమ్మ-కృష్ణయ్య, గొల్లపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్ రావు, బీచుపల్లి గ్రామ ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి వెంకటదాసు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, రైతాంగ అభ్యున్నతి, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం స్వామివారి ఆశీస్సులు కోరారు. ఆలయ నిర్వాహకులు నాయకులకు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన సమాజంలో శాంతి, సామరస్యాలకు పునాది అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రజలకు మానసిక ప్రశాంతతను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో గ్రామసభ

ఉమ్మడి గోపాలపేట, జూన్ 9 (మనం న్యూస్): గోపాలపేట మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి రామ్ సాగర్ తెలిపారు. గ్రామ సర్పంచ్ బంగారయ్య అధ్యక్షతన గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం గ్రామసభ జరగనుందని పేర్కొన్నారు. ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలతో పాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, గ్రామ ప్రజలందరూ గ్రామసభకు హాజరై తమ సమస్యలు, సూచనలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ బంగారయ్య పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామసభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి రామ్ సాగర్ కోరారు.

## మా శెట్టి అనంతరాములు ఎన్నిక పట్ల హర్షం



మేళ్లచెరువు జూన్ 9 మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా మా శెట్టి అనంతరాములు నియమితులైనందుకుగాను మేళ్లచెరువు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వరగాని నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొప్పురావూరి విజయశంకర్, కోశాధికారి విడాల పురుషోత్తం, హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా మంగళవారం హైదరాబాదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అనంతరాములు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేద ఆర్యవైశ్యులకు, విద్యాపరంగా, వైద్య పరంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని వారు అనంత రాములను కోరారు.

## మహిళా సాధికారతకు మరో ముందడుగు

### మహిళా శక్తి కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు బయలుదేరిన కల్వకుర్తి మండల సమాఖ్య సభ్యులు



కల్వకుర్తి రూరల్, జూన్ 09 (మనం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారత కోసం నిర్వహిస్తున్న మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగే భారీ కార్యక్రమానికి కల్వకుర్తి మండల సమాఖ్యకు చెందిన 48 మంది కార్యనిర్వహణ మహిళా సభ్యులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మహిళా సమాఖ్యలకు 553 ఆర్టీసీ బస్సులను పంపిణీ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏపీఎం చంద్రయ్య, సీసీలు యాదగిరి, మల్లేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మతో పాటు ఎంఎంఎస్ ఈసీ సభ్యులు కూడా హైదరాబాద్‌కు వెళ్లారు. కార్యక్రమానికి ముందుగా ఎంపీడీవో గాలి యాదయ్య ఎంఎంఎస్ కార్యవర్గ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, కార్యక్రమంలో క్రమశిక్షణతో పాల్గొని మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంపై మహిళా సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఉత్సాహంగా హైదరాబాద్ కు బయలుదేరారు.




## రావెళ్ల రామదాసు మృతికి సంతాపం



సూర్యాపేట జూన్ 09 (మనం ప్రతినిధి) ప్రముఖ వైద్యులు మురళి మోహన్ మామ రావెళ్ల రామదాస్ అనారోగ్యం కారణంగా మరణించడంతో విషయం తెలుసుకున్న 18వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ వైద్యులు ఊరా రామమూర్తి యాదవ్ రామదాసు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో పలువురు వైద్యులు రాజకీయ ప్రముఖులు సన్నిహితులు ఉన్నారు.

## మళ్లీ బడిబాట.. చిన్నారుల అడుగుల్లో కొత్త ఆశలు

సెలవుల సందడి ముగిసి..

విద్యాలయాల వైపు విద్యార్థుల ప్రయాణం

**ఆనందం, ఆత్మీయత, కొత్త కలలతో పాఠశాలలకు చేరుతున్న చిన్నారులు**

**ప్రత్యేక కథనం మనం న్యూస్**



అచ్చంపేట జూన్ 09(మనం న్యూస్): రెండు నెలల వేసవి సెలవులు ముగిశాయి. ఇంటి వద్ద ఆటపాటలతో, బంధువుల సందర్శనలతో, సరదా కబుర్లతో గడిపిన చిన్నారులు మళ్లీ పుస్తకాల బాట పట్టారు. నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విద్యార్థుల సందడి కనిపిస్తోంది. కొత్త బ్యాగులు, కొత్త పుస్తకాలు, కొత్త యూనిఫాంలతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు బయలుదేరుతున్నారు. కొంతమంది విద్యార్థులు తమ స్నేహితులను మళ్లీ కలుసుకోబోతున్న ఆనందంలో ఉంటే, మరికొందరు కొత్త తరగతి, కొత్త ఉపాధ్యాయులపై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా ఒకటో తరగతిలో అడుగుపెడుతున్న చిన్నారుల్లో కొంత భయం, మరికొంత ఉత్సాహం కనిపిస్తోంది. తల్లిదండ్రుల చేతులు పట్టుకుని పాఠశాలకు వెళ్లే చిన్నారుల చిరునవ్వులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. తల్లిదండ్రుల మనసుల్లో కూడా ఈ రోజు ప్రత్యేకమైనదే. తమ పిల్లలు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల భవిష్యత్తు కోసం పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలు కొనుగోలు చేసి వారిని బడికి పంపిస్తున్నారు. తమ పిల్లలు మంచి విద్యను అభ్యసించి సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలని ఆశిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబాలకు చెందిన పిల్లలు, గిరిజన తండాల్లోని విద్యార్థులు, కార్మికుల పిల్లలు అందరూ సమానంగా విద్యను అందిపుచ్చుకోవాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, వసతి సౌకర్యాలు పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ఆప్యాయంగా స్వాగతించేందుకు సిద్ధమయ్యారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు నేర్చుకోవాలని వారు ఆకాంక్షిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్ర బాధ్యత తమపై ఉందని భావిస్తూ కొత్త విద్యా సంవత్సరానికి సన్నద్ధమయ్యారు. వేసవి సెలవుల అనంతరం మళ్లీ పాఠశాల ప్రాంగణాలు చిన్నారుల కేరింతలతో మారుమోగుతున్నాయి. స్నేహితులతో కలయిక, ఉపాధ్యాయుల ఆశీర్వాదం, కొత్త పాఠాల ప్రారంభం---ఇవన్నీ కలిసి విద్యార్థుల జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నాయి. "నేటి విద్యార్థులే రేపటి భారత భవితవ్య నిర్మాతలు" అనే భావనతో ప్రతి చిన్నారి చదువులో ముందంజ వేయాలని, ప్రతి తల్లిదండ్రి కలలు సాకారం కావాలని సమాజం ఆకాంక్షిస్తోంది. విద్య అనే వెలుగు ప్రతి ఇంటిని ప్రకాశింపజేయాలని అందరూ కోరుకుంటున్నారు.

